# శ్రీ నిశ్శంకరరావు వెంకటరత్నం

శ్రీ నిశ్శంకరరావు వెంకటరత్నం ఏడవ శాసనసభ (1983-1984) స్పీకరుగా 1984వ సంవత్సరం సెప్టెంబర్ 20వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1985వ సంవత్సరం జనవరి 10వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు 1927వ సంవత్సరము జూన్ 17వ తేదీన గుంటూరు జిల్లాకు సమీపంలోని ఏటుకూరు గ్రామంలో జన్మించారు. గుంటూరులోని ఎ.సి. కాలేజిలో బి.ఎ. డిగ్రీని, మద్రాసు లా కాలేజి నుండి లా డిగ్రీని పూర్తి చేసి న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు.

శ్రీ వెంకటరత్నం 1972వ సంవత్సరములో ఐదవ శాసనసభకు, 1983వ సంవత్సరములో ఏడవ శాసనసభకు గుంటూరు-2 నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.

వీరు 1983-1984 సంవత్సరాల మధ్య కాలంలో ప్రభుత్వ సంస్థల కమిటీ అధ్యక్షునిగా పనిచేశారు. 1985వ సంవత్సరములో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో తెనాలి నియోజవర్గం నుంచి లోకసభకు ఎన్నికైనారు. శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా శ్రీ వెంకటరత్నం రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమైనవి.

వీరు 2004వ సంవత్సరం ఆగస్టు 6వ తేదీన మరణించారు.

## శ్రీ నిశ్శంకరరావు వెంకటరత్నం స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

తెలుగుదేశం నాయకులు శ్రీ ఎన్.టి. రామారావుగారు, మిత్ర పక్షాల నాయకులు అందరూ నాపట్ల వెలిబుచ్చిన అభిప్రాయాలకు నా కృతజ్ఞతను తెలియజేస్తున్నాను. మీరంతా నామీద ఉంచిన నమ్మకానికి న్యాయం కలగజేస్తాను. ప్రజలు మనలనుంచి చాలా విషయాలను ఎదురు చూస్తున్నారనుకొంటున్నాను. ఉన్నత ప్రమాణాలను నిలబెడతామని ప్రజలు మనలను సభ్యులుగా గెలిపించారు. వారి ఆశలు వమ్ముకాకుండా ఆ ఉన్నత ప్రమాణాలను నిలబెట్టడానికి మీ అందరి సహకారముతో కృషిచేస్తానని ఈ శుభసమయంలో మనవి చేస్తున్నాను. నామీద వుంచిన నమ్మకమును నిలబెట్టడానికి కృషిచేస్తాను. ఇక్కడున్న మిత్రులకు, ఇక్కడలేని మిత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.